క్లుప్తంగా

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని జెడ్పీ హెచ్ఎస్ పాఠశాలలో 1989–90లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించుకున్నారు. అప్ప టి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో తుమ్మ శ్రీధర్‌రెడ్డి, కనుకుంట్ల రఘు, వసంత రమేశ్, చెరుకూరి రామనాథం, సరికొప్పుల వెంకటేశ్వర్లు, దడిగల సత్యనారాయణ పాల్గొన్నారు.

సన్మానం



మహాముత్తారం: పదవీ కాలం పూర్తయిన మాజీ జెడ్పీటీసీ లింగమల్ల శారద, నల్లగుంటవీ ఎనాజీపేట ఎంపీటీసీ గంట ఉమాదేవేందర్‌రెడ్డితోపాటు వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి వేణును ఆదివారం మీనాజీపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామానికి చెందిన నాయకులు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గంట దేవేందర్‌రెడ్డి, లింగమల్ల దుర్గయ్య, ఓలపు శంకర్‌పటేల్, మోత్కూరి రవి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఏఈఈ ఉద్యోగాలు సాధించిన వారికి..



చిట్యాల: మండలంలోని కాకతీయ హైస్కూల్‌లో 2014–15లో చదివిన ముగ్గురు విద్యార్థులు గూడెపు వర్షిత, పుట్టపాక నిరంజన్, బుర్ర వినీల్ భరద్వాజ్ ఏఈఈ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. దీంతో ఆనందం వ్యక్తం చేస్తూ పాఠశాల కరస్పాండెంట్ ఎండీ.రాజ్‌మహ్మద్ వారికి ఆదివారం కాకతీయ హైస్కూల్‌లో ఆవరణంలో సన్మానం చేశారు. అనంతరం రాజ్‌మహ్మద్ మాట్లాడుతూ తమ పాఠశాలలో ఎంతో మంది విద్యార్థులు ఉన్నత చదువులు చదివి ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా ఏఈఈలుగా ఎంపికైన పూర్వ విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఆఫీజ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పరామర్శ



రేగొండ: మండలంలోని రూపిరెడ్డిపల్లి గ్రామంలో విద్యుదాఘాతంతో పంచగిరి రమేశ్ మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆదివారం పరామర్శించారు. మృతుడి అంతిమ యాత్రలో పాల్గొన్నారు. పీసీసీ అధికార ప్రతి నిధి గాజర్ల అశోక్, బండారి దేవేందర్, మొట్టె కిరణ్ పటేల్, మేకల భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ

శాయంపేట : మండల కేంద్రంలో చేపట్టిన రోడ్డు విస్తరణలో భాగంగా తొలగించిన విద్యుత్ స్తంభాలను విద్యుత్‌శాఖ సిబ్బంది ఆదివారం పునరుద్ధరించారు. కొత్త స్తంభాలను పునరుద్ధరించడంతో స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లైన్‌మెన్ సంతోశ్, జేఎల్ఎం విష్ణు, విద్యుత్ సిబ్బంది అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

ముమ్మరంగా వరినాట్లు



మొగుళ్లపల్లి శివారులో గొర్రు ద్వారా చదును చేస్తున్న రైతు



మొగుళ్లపల్లి శివారులో వరి నాట్లు వేస్తున్న మహిళలు

- ఆశించిన మేర కురిసిన వర్షాలు
- వ్యవసాయ పనుల్లో రైతన్న నిమగ్నం

మొగుళ్లపల్లి: మండలంలో వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. వానాకాలం సీజన్‌లో ఆశించిన మేర వర్షాలు కురవడంతో రైతులు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు పంట పొలాల్లో ఒడ్లు చెక్కుకోవడం, ట్రాక్టర్‌తో పొలాన్ని దమ్ము చేయించుకోని వరి నాట్లు వేస్తున్నారు. మండల వ్యాప్తంగా సుమారు 8500 ఎకరాల్లో వరి పంటను సాగు చేసే అవకాశాలు ఉన్నాయని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు.

యంత్రసాగుతో పెనుభారం..

పెరిగిన డిజిల్ ధర రైతులపై పెను ప్రభావం చూపెడుతోంది. గతేడాది పొలం దమ్ము చేయడానికి ఎకరానికి రూ.6000 తీసుకోగా ప్రస్తుత సీజన్‌లో రూ.7000 తీసుకుంటున్నారు. అలాగే నాటు వేయడానికి కూలీలు గతేడాది రూ.4000 తీసుకోగా ఈ సీజన్‌లో రూ.5000 తీసుకుంటున్నారు.

పెట్టుబడి ఖర్చులు పెరిగాయి..



ఇప్పుడు వర్షాలపైనే వ్యవసాయం ఆధారపడి ఉంది. వాతావరణ శాఖ అధికారులు తెలిపినట్లు వర్షాలు విస్తారంగా కురిస్తేనే ఉత్సాహంతో పంటలు పండిస్తాం. పెట్టుబడి ఖర్చులు పెరగడంతో ఎకరాకు అన్ని కలిపి రూ.20 వేల వరకు ఖర్చు వస్తుంది.

– పడిదల నర్సింగరావు , రైతు, మొగుళ్లపల్లి

యాంత్రీకరణతో తక్కువ ఖర్చు



ప్రస్తుత వ్యవసాయంలో కూలీల కొరత ఎక్కువగా ఏర్పడుతుంది. రైతులు యాంత్రీకరణ పద్ధతి వైపు అడుగులు వేయాలి. నాట్లువేసే, కలుపు తీసే మిషన్లు, వెదజల్లె పద్ధతి ద్వారా రైతులకు ఖర్చు తక్కువగా అవడంతో పాటు కూలీల కొరతను అధికమించవచ్చు.

– సురేందర్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి

పంటలకు సాగునీరు అందించాలి



మాట్లాడుతున్న తుమ్మల వెంకటరెడ్డి

ములుగు రూరల్ : దేవాదుల ప్రాజెక్ట్ ద్వారా రైతులకు పంటసాగు నీరు విడుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి అన్నారు. ములుగు జిల్లా కేంద్రంలో ఆదివారం మండల కమిటీ సమావేశం నిర్వహించగా ముఖ్య అతిథిగా వెంకటరెడ్డి హాజరై మాట్లాడారు. సమ్మక్క–సారక్క బ్యారేజీ నిర్మించిన కూడా రామప్ప సరస్సుకు తప్ప జిల్లాలో ఎక్కడ రైతులకు దేవాదుల ద్వారా సాగు నీరు అందించడం లేదన్నారు. యుద్ధప్రతిపాదికన జిల్లా రైతులకు గోదావరి నీరు అందించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక రూపొందించాలన్నారు. అలాగే రెండు పంటలకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. వాజేడు మండలంలోని మోడికుంట ప్రాజెక్టుకు, గుండ్లవాగు ప్రాజెక్టుకు వెంటనే నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి ఎండీ గఫూర్ పాషా, కమిటీ సభ్యులు, రత్నం ప్రవీణ్, కొర్ర రాజు, జున్ను దేవేందర్, రవి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

'న్యాయం చేయండి'

ములుగు: తన భూమిని ప్రభుత్వం పెట్రోల్ బంక్ కోసం తీసుకుటుందని ఆ భూమిపై ఆధారపడి జీవించిన తనకు ఎలాంటి ఆధారం లేకుండా పోయిందని కాశిందేవిపేట గ్రామానికి చెందిన కవ్వంపల్లి అనిల్ ఆదివారం ఒక ప్రకనటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ములుగు మండలం బండారుపల్లి శివారులోని సర్వే నంబర్ 348లో తన అత్తమామలు ఇచ్చిన భూమిని ప్రభుత్వం పెట్రోల్ బంక్ ఏర్పాటుకు తీసుకుంటుందని తెలిపారు. దీంతో ఎలాంటి ఆధారం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నానని వాపోయారు. కలెక్టర్ స్పందించి తగిన న్యాయం చేయాలని కోరారు.

నియంత్రణ చర్యలు చేపట్టాలి

కాటారం: మండల కేంద్రంలో ప్రధాన రహదారులపై తిరుగుతున్న పశువుల నియంత్రణకు అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకుడు దుర్గం తిరుపతి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాత్రి వేళల్లో మూగజీవాలు నడిరోడ్లపై తిరగడం వల్ల వాహనదారులు గమనించక ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. యజమానులు పశువులను పట్టించుకోకుండా వదిలివేయడం వల్ల ఇలాంటివి చోటు చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. పంచాయతీ అధికారులు స్పందించి రోడ్లపై విచ్చలవిడిగా తిరుగుతున్న పశువులను వేములవాడ లేదా కాళేశ్వరం గోశాలకు తరలించాలని తెలిపారు. రోడ్లపై తిరుగుతున్న పశువుల నియంత్రణకు చర్యలు చేపట్టకపోతే ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నాలు చేస్తామని హెచ్చరించారు.

అంగన్‌వాడీ కేంద్రంలోకి పాము

మల్హర్: మండలంలోని సెక్టార్–2 పరిధిలోని అన్సాన్‌పల్లి అంగ్‌వాడీ కేంద్రం–1లో శనివారం పాము దూరిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి.. ఉదయం అంగన్‌వాడీ సెంటర్‌లోని వారండాలో పిల్లలు, అంగన్‌వాడీ సిబ్బంది కూర్చోని ఉన్నారు. ఒక్కసారిగా సెంటర్ వెపునకు వస్తున్న జెర్రిగొడ్డు పామును గమనించిన ఆయా పాము, పాము అని అరిచి పిల్లలను తీసుకోని ఆరు బయటకు పరిగెత్తింది. పాము సెంటర్‌లోని రూమ్‌కు వెళ్లింది. దీంతో అంగన్‌వాడీ టీచర్ డోర్‌ను మూసి, గ్రామస్తుల సహకారంతో భూపాలపల్లిలో పాములు పట్టే రహీంకు సమాచారం అందించారు. రహీమ్ అక్కడికి చేరుకోని పామును పట్టుకోని సమీపంలోని అటవీ ప్రాతంలోకి వదిలేశారు. సెంటర్‌లో కంప చెట్లతో నిండిన చె త్తాచెదారం ఉండటంతో పాములు తిరుగుతున్నాయని, పిల్లలకు ఏదైనా జరిగితే ఎవరూ బాధ్యత వహిస్తారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జలపాతం వద్ద పర్యాటకుల సందడి



జలపాతం వద్ద పర్యాటకులు

వాజేడు: మండల పరిధిలోని చీకుపల్లి సమీపంలో ఉన్న బొగత జలపాతం వద్ద పర్యాటకులు సందడి చేశారు. ఆదివారం సెలవు కావడంతో పర్యాటకులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ప్రకృతి అందాలకు ఫిదా అయ్యారు. జలపాతం జలధారలను వీక్షించడంతో పాటు సెల్ ఫోన్లలో బంధించారు. సెల్ఫీలు దిగి సరదగా గడిపి సందడి చేశారు.

సభ్యత్వాలు అత్యధికంగా నమోదు చేయాలి



మాట్లాడుతున్న శ్రీనుబాబు

కాటారం: నియోజకవర్గంలో యూత్ కాంగ్రెస్ సభ్యత్వాలు రాష్ట్రంలోనే అత్యధికంగా నమోదు చేయాలని మంత్రి శ్రీధర్‌బాబు సోదరుడు దుద్దిళ్ల శ్రీనుబాబు అన్నారు. మండలంలోని ధన్వాడ గ్రామంలో నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమీక్ష సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనుబాబు మాట్లాడుతూ.. రానున్న యూత్ కాంగ్రెస్ అధ్యక్షుల ఎన్నికల్లో బరిలో ఉన్న అభ్యర్థులు సభ్యత్వ నమోదును ప్రారంభించాలని తెలిపారు. సభ్యత్వాల్లో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచేలా కృషి చేయాలని సూచించారు. యూత్ నాయకులకు పార్టీ అండగా ఉంటుందని, సెప్టెంబర్ 5వరకు జరిగే సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఎరవెల్లి విలాస్‌రావు, సంయుక్త కార్యదర్శి బండ కిషోర్‌రెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు బర్ల శ్రీనివాస్, మండల అధ్యక్షుడు చీమల సందీప్, నాయకులు వంశీ, రాజేందర్, క్రాంతి, ప్రవీణ్, రాజు, శివ, రాహుల్, నజీర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం



ఏటూరునాగారం: ఫ్రెండ్‌షిప్‌బ్యాండ్‌లు కడుతున్న స్నేహితులు



గోవిందరావుపేట: మొద్దులగూడెంలో చిన్నారుల ఆనందోత్సవం

ఏటూరునాగారం: మండలంలోని యువతీ యువకులు, విద్యార్థులు కలిసి స్నేహితుల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. చిన్నారులు సైతం వారి తోటి స్నేహితులకు ఫ్రెండ్‌షిప్‌బ్యాండ్‌లను కడుతూ శుభాకాంక్షలు తెలిపి ఆనందంగా గడిపారు.

గోవిందరావుపేట: మండల పరిధిలోని మొద్దులగూడెంలో పిల్లలు ఆదివారం స్నేహితుల దినోత్సవం నిర్వహించుకున్నారు. ఒకరికొకరు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లను కట్టుకుని సంతోషాన్ని వ్యక్తం చేశారు.

సర్వీస్ ప్రొటెక్షన్ కల్పించాలి

మంగపేట: పరస్పర బదిలీలపై(మ్యూచివల్) వెళ్లిన ఉపాధ్యాయులకు సర్వీస్ ప్రొటెక్షన్ కల్పించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీఎస్ యూటీఎఫ్)జిల్లా సీనియర్ గౌరవ సలహాదారు, రాజుపేట జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు గడ్డం శ్రీనివాస్ రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డిని ఆదివారం ఉత్తరం ద్వారా కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని 33 జిల్లాలుగా విభజించిందన్నారు. రాష్ట్రంలోని అన్ని విభాగాల్లో అన్ని జిల్లాల్లో కొన్ని ఎక్కువ పోస్టులు, కొన్ని తక్కువ పోస్టులు ఉండటం వలన తక్కువ పోస్టులు ఉన్న జిల్లాల్లో ప్రభుత్వం నేరుగా డీఎస్సీ ద్వారా నూతన రిక్రూట్‌మెంట్ ఏర్పాటు చేయలేదన్నారు. దీంతో 317 అనే కొత్త జీఓను తెరమీదకు తెచ్చి ఉపాధ్యాయులను అన్ని విభాగాల్లో బలవంతంగా తక్కువ పోస్టులు ఉన్న జిల్లాలకు పంపించడం జరిగిందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు అనేక బాధలతో మనోవేదనకు గురవుతూ ఉద్యమాలు చేస్తే అప్పటి ప్రభుత్వం మ్యూచివల్ బదిలీలపై వెళ్లి తే.. పాత సర్వీస్ ప్రొటెక్షన్ ఉంటాయని చెప్పడం జరిగిందన్నారు. కాని అప్పటి ప్రభుత్వం ఎలాంటి జీఓ చేయకపోవడంతో తమకు సర్వీస్ ప్రొటెక్షన్ పాయింట్లు ఆడ్ కావడం లేదన్నారు. గత 30 ఏళ్లుగా సర్వీసు పూర్తి చేసిన ఉపాధ్యాయులకు కూడా ఎలాంటి న్యాయం జరగటం లేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం న్యాయం జరిగే విధంగా జీఓను సవరించి కనీస సర్వీస్ ప్రొటెక్షన్ కల్పిస్తూ బదిలీలు, ప్రమోషన్ అవకాశం కల్పించే విధంగా తోడ్పాటును అందించాలని ఉత్తరంలో పేర్కొనట్లు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక



పార్టీలో చేరిన వలియాబీ సలీంతో నాయకులు

ఏటూరునాగారం: మండల కేంద్రానికి చెందిన మాజీ మండల కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ సలీం బీఆర్ఎస్ నుంచి ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు, మైనార్టీ సెల్ జిల్లా అ ధ్యక్షుడు ఎండి అయిబ్ ఖాన్, కన్నాయిగూడెం మండల అధ్యక్షులు ఎండి అప్సర్ పాషా, ముజామిల్, రవిచందర్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిసకావొద్దు



ఏటూరునాగారం: పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఎస్పీ శివం ఉపాధ్యాయ

ఏటూరునాగారం: యువత మత్తు పదార్థాలకు బానిసకావొద్దని ఏఎస్పీ శివం ఉపాధ్యాయ అన్నారు. మండల కేంద్రంలో జెడ్పీహెచ్ఎస్‌లో యాంటి డ్రగ్స్ పోస్టర్‌ను ఆదివారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, సీఐ శ్రీనివాస్, ఎస్సైలు తాజొద్దిన్, రమేశ్‌తోపాటు ప్రెస్ క్లబ్ కార్యదర్శి అలువాల శ్రీనివాస్, వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు గంపల శివకుమార్‌తో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఏఎస్పీ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థిలో సేవ, క్రీడా, దేశభక్తి ఉండాలన్నారు. తోటి వారికి సాయం చేయాలన్నారు. కళ్ల ఎదుట జరిగే అన్యాయాలను, చట్ట వ్యతిరేక పనులను వ్యతిరేకించాలన్నారు. చెడు అలవాట్లకు వెళ్లకుండా సన్మార్గంలో ప్రయణించాలని కోరారు. అంతేకాకుండా గ్రామంలో డీజే సౌంట్స్‌తో ప్రచార రథాన్ని చేపట్టారు. గ్రామ గ్రామ పురవీధుల్లో ప్రచార రథం తిప్పుతూ గంజాయి, మత్తు పదార్థాలను బానిసకావొద్దని పాటల రూపంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా గుడి చైర్మన్ పెండ్యాల ప్రభాకర్, సీపీఎం మండల కార్యదర్శి దావూద్, పీఈటీలు రవి, రమేష్, స్వరూప పాల్గొన్నారు.



వాజేడు: పోస్టర్ ఆవిష్కరిస్తున్న పోలీసులు

వాజేడు: మండలంలోని పేరూరు పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ శబరీష్ ఆదేశాల మేరకు ఆదివారం వాలీబాల్ పోటీలను ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ నిర్వహించారు. ఈ పోటీల్లో 14 జట్లు పాల్గొనగా కృష్ణాపురం జట్టు విజయం సాధించి విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలనే ఉద్దేశ్యంతో యువతను క్రీడల వైపు మళ్లించదానికి వాలీబాల్ పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. యువత చెడు మార్గాలకు దూరంగా ఉండాలని వాహనాలను నిదానంగా నడపాలని కోరారు. అలాగే డ్రగ్స్ వ్యతిరేక పోస్టర్లను ఆవిష్కరించారు.

క్రీడలతో మానసికోల్లాసం



వెంకటాపురం(కె): వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న సీఐ బండారి కుమార్

వెంకటాపురం(కె): క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఏఎస్పీ శివం ఉపాధ్యాయ అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణంలో మేరకు యాంటీ డ్రగ్స్ క్యాంపియన్‌లో భాగంగా మండల స్థాయి వాలీబాల్ పోటీలను పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీలను సీఐ బండారి కుమార్ ప్రారంభించగా ఆయన పాల్గొని మాట్లాడారు. యువత దృష్టి చెడు అలవాట్లు, మారక ద్రవ్యాల వైపుకు వెళ్లకుండా శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం కలిగించే క్రీడల వైపునకు మలచాలనే ఉద్దేశ్యంతో వాలీబాల్ టోర్నమెంట్స్ నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ పోటీల్లో మండలంలోని 18 టీమ్‌లు పాల్గొటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కొప్పుల తిరుపతి రావు, సీఆర్‌పీఎఫ్ డీఎస్పీ ప్రశాంత్, పీడీలు సత్యనారాయణ, పీటి గొంది హనుమంతు, నర్సింహమూర్తి, భార్గవ్ తదితరులు ఉన్నారు.

పత్తిలో లోపించిన ఎదుగుదల



టేకుమట్లలో ఎర్రబారిన పత్తి పంట



రామకృష్ణాపూర్ శివారులో ఎదుగుదల లోపించిన పత్తి పంట

- అధిక వర్షాలతో తెగుళ్లు
- పంటపై ఆశలు వదులుకుంటున్న రైతులు

టేకుమట్ల: మండలంలో ఎక్కువ రైతులు పత్తి పంటనే పండిస్తూ వ్యవసాయం చేస్తున్నారు. ఈ సంవత్సరం మండలంలో సుమారు 8వేలకు పైగా ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. విత్తన సమయంలో పత్తి విత్తనాలు నాటిన మొదట్లో వర్షాలు లేకపోవడంతో ఎంతో మంది రైతులు డ్రిప్పులు, స్ప్రింకర్ల సహాయంతో పత్తి మొలకలను కాపాడుకున్నారు. కొంత సమయం తర్వాత అప్పుడప్పుడు వర్షాలు పడడంతో పూర్తి స్థాయిలో పత్తి మొక్కలకు ప్రాణం పోసినట్లు అయింది. కాగా, ప్రస్తుతం వరుస వర్షాల కారణంగా పత్తి పంట ఎదుగుదల లోపించి కనీసం పెట్టుబడి వచ్చే పరిస్థితి కనబడటం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల పత్తి మొక్కలు ఏపుగా పెరిగినా లోతట్టు ప్రాంతాల పత్తి పంటలు మాత్రం పూర్తిగా ఎదుగుదల లోపించి ఎరుపు తెగులు సోకి ఎదుగడం లేదు.

గెరువిస్తేనే చేతికొస్తుంది..

ఇప్పటికైనా వర్షాలు నిలిచిపోతే నేల తడి ఆరి గొర్రు కొడుతుంటే మొక్క ఎదుగుదల వృద్ధి చెందుతుంది. పత్తి పంటలపై రైతులు ఇప్పటికే సుమారుగా ఎకరాకు రూ.15వేలకు పైగా పెట్టుబడి పెట్టారు. ఇప్పటికైనా కాలం కలిసొస్తే కనీసం పెట్టిన పెట్టుబడి అయినా వస్తుందని ఇలాగే వర్షాలు కురిస్తే నష్టాలే మిగిలే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎదుగుదల లోపించింది

నాకున్న ఎకరం వ్యవసాయం భూమిలో పత్తి పంట సాగు చేశా. రోజు కురుస్తున్న వర్షాల వల్ల చెట్టు పెరుగటం లేదు. గుంటుక కొడదామంటే నేల పదనుండి సాగుడం లేదు, చెట్టు పెరుగడం లేదు. ఇప్పటికే 15 వేల పెట్టుబడి పెట్టాను.

–స్వామి, రైతు అంకుషాపూర్

పోషకాలను అందించాలి

పత్తి మొక్కలు ఎదగకుంటే నేలతడి ఆరాక గొర్రు కొట్టుకొని మొక్కలకు సుక్ష్మ పోషక ఎరువులను అందించాలి. యూరియా, 20–20, ట్రిపుల్ 19 ఎరువులను వేయాలి.

– శ్రీనివాస్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



గాయపడ్డ యాకూబ్

రేగొండ: రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన మండలంలోని దమ్మన్నపేట క్రాస్ వద్ద ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిసిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రూపిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మహ్మద్ యాకూబ్ పాషా మండల కేంద్రానికి వచ్చి తిరిగి రూపిరెడ్డిపల్లికి ఆటోలో వెళ్తుండగా దమ్మన్నపేట క్రాస్ వద్ద ఎదురుగా వస్తున్న కారు ఆటోను ఢీ కొట్టింది. దీంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. స్పందించిన స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో చికిత్స నిమిత్తం పరకాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాధితుని బావమరిది యాకూబ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
జయశంకర్ భూపాలపల్లి :
9951602872
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎ. మహేష్ (S.R) : 9505555291
కె. సుధాకర్ (ACO) : 9177258410